సాక్షి తిరుపతి

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



కించపరిచేలా కాదు..త్యాగాలు చూపండి

పుష్ప సినిమా రెండో భాగంలో అయినా అటవీ, పోలీసు అధికారులను కించపరిచేలా కాకుండా త్యాగాలను చూపాలని టాస్క్‌ఫోర్స్ విశ్రాంత ఐజీ కాంతారావు సూచించారు.

- 8లో



సామాన్య భక్తుడికే తొలి ప్రాధాన్యం

శ్రీవారి దర్శనంలో టీటీడీ సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తోంది. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు నిత్యం వేలాదిగా శ్రీవారి దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	24
చిత్తూరు	41	24
తిరుమల	36	21
గూడూరు	42	27
నగరి	42	26

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6.29	4.35
చిత్తూరు	6.31	4.35
పుంగనూరు	6.33	4.38



తిరుపతి బస్టాండ్‌లో విద్యుత్ బస్సులు



తిరుపతి బస్టాండ్‌లో విద్యుత్ బస్సులకు చార్జింగ్ పెడుతున్న సిబ్బంది

పర్యావరణహితమండి.. సురక్షిత బండి

వాయు కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోంది.. ఇంధనం ధర ఆకాశాన్నంటుతోంది.. ప్రయాణికులపై భారం మోపలేని పరిస్థితుల్లో ఆర్టీసీ నిర్వహణ కష్టతరంగా మారుతోంది.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. పర్యావరణానికి ఏమాత్రం హాని చేయని విద్యుత్ బస్సుల వైపు మొగ్గుచూపుతోంది. ఇందుకోసం పకడ్బందీ కార్యాచరణకు ప్రారంభించింది. అందులో భాగంగా ఇప్పటికే అలిపిరి డిపోకు 100 ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. తిరుపతి– తిరుమల మధ్య రాకపోకలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే జిల్లాకు మరో 224 వాహనాలను కేటాయించేందుకు సన్నాహాలు చేస్తోంది.

- కాలుష్య రహితంగా ఎలక్ట్రిక్ బస్సులు
- ప్రకృతికి ఎలాంటి హాని చేయవంటున్న నిపుణులు
- తిరుపతి– తిరుమలకు నడుస్తున్న 100 విద్యుత్ వాహనాలు
- జిల్లాకు అదనంగా మరో 224 మంజూరు
- చార్జింగ్ పాయింట్ల కోసం అన్వేషిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చమురు ధరలు పెరుగుతున్నా బస్సు చార్జీలు పెంచకుండా అదనపు భారాన్ని దాదాపు నాలుగేళ్లుగా భరిస్తోంది. ఈ క్రమంలో విద్యుత్ బస్సులతో నష్ట నివారణకు చర్యలు చేపట్టింది. అలాగే కాలుష్య నియంత్రణకు సైతం పెద్దపీట వేసింది. ముందుగా ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలకు విద్యుత్ బస్సులను ఏర్పాటు చేసింది. తిరుపతిలోని అలిపిరి డిపో నుంచి ప్రస్తుతం 75 బస్సుల రాకపోకలను ప్రారంభించింది. మే తొలి వారం నుంచి మరో 25 బస్సులను అందుబాటులోకి తీసుకువస్తోంది.

అదనంగా 224 బస్సులు

అలిపిరితోపాటు మంగళం డిపోను ఎలక్ట్రికల్ బస్సుల నిలయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ఉన్న 100 బస్సులకు అదనంగా 224 విద్యుత్ బస్సులు జిల్లాకు కేటాయించనుంది. ఈ బస్సుల్లో అధిక భాగం తిరుమల ఘాట్‌లో రాకపోకలు సాగించేందుకు ప్రాధాన్యమివ్వనుంది. అలాగే తిరుపతి నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్టు , మదనపల్లె , కడపకు, నెల్లూరుతోపాటు ప్రముఖ ఆలయాలు, ముఖ్యమైన ప్రాంతాలకు విద్యుత్ బస్సులను నడిపేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది.

పల్లెలకు మరింత మెరుగైన రవాణా

జిల్లాకు విద్యుత్ సర్వీసులు పెరుగుతున్న నేపథ్యంలో మిగులు బస్సులను పల్లెలకు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అన్ని గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. అయినప్పటికీ ఇప్పుడు అదనపు బస్సులను కూడా కేటాయించనున్నారు.

చార్జింగ్ పాయింట్లకు అన్వేషణ

విద్యుత్ బస్సులు పెరుగుతున్న నేపథ్యంలో తిరుపతి, అలిపిరి, మంగళం డిపోల్లో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడానికి ఆర్టీసీ అధికారులు స్థలాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికే అలిపిరి డిపోలో 42 చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. తిరుపతి డిపోలో 6 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. తిరుపతి డిపోలో మరో 10 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేపట్టారు. ఒక్కో పాయింట్‌లో రెండు నుంచి నాలుగు విద్యుత్ బస్సులు చార్జింగ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే చాలు..

తిరుపతి అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందినవారికి ఆర్టీసీ తీపి కబురు అందిస్తోంది. ఆసక్తి ఉన్నవారిని విద్యుత్ బస్సులకు డ్రైవర్లుగా తీసుకుంటోంది. ఇప్పటికే 19 బ్యాచ్‌లు 304 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు.వారిలో పలువురు అలిపిరి డిపోలోని విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. అయితే విద్యుత్ సర్వీసులు పెరుగుతున్న తరుణంలో మరింత మందికి అవకాశం దక్కనుంది.

తిరుపతి బస్టాండ్‌లో మరో పాయింట్లు



స్థల పరిశీలనలో అధికారులు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లు ప్రస్తుతం 10 ఉన్నాయి. వీటికి అదనంగా మరో ఆరు పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చార్జింగ్ పాయింట్ల ఏర్పాటునకు స్థల పరిశీలన చేపట్టారు. దశలవారీగా తిరుపతి బస్టాండ్‌లో 50 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే మంగళం, తిరుమల డిపోల్లో సైతం అదనపు చార్జింగ్ పాయింట్లు పెట్టేందుకు ప్రత్యేక బృందం కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు, తిరుపతి డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, విద్యుత్ బస్సుల సీఈఓ విజయకుమార్, యూనిట్ ఆఫీసర్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు తొలి ప్రాధాన్యం



పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణే లక్ష్యంగా విద్యుత్ బస్సులను తిరుమల ఘాట్‌రోడ్డులో నడిపేందుకు తొలి ప్రాధాన్యమిస్తున్నాం. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాలకు కూడా సర్వీసులను పంపేందుకు చర్యలు చేడతాం. ఈ బస్సుల్లో ప్రయాణం సులువుగా ఉంటుంది. అదనపు బస్సులు వస్తే మరింత మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయి.

– చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి

“

సంతోషంగా ఉంది



అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్నాం . హెవీ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చింది. ప్రస్తుతం విద్యుత్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నా. మరిన్ని బస్సులు వస్తున్న నేపథ్యంలో స్థానికులకు ఎక్కువ అవకాశాలు రానున్నాయి. విద్యుత్ బస్సులను కేటాయించి ఉద్యోగ ఉపాధి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– హేమంత్ రెడ్డి, విద్యుత్ బస్సు డ్రైవర్

డ్రైవింగ్ సులభమే..



సాదారణ బస్సులతో పోల్చుకుంటే విద్యుత్ బస్సు డ్రైవింగ్ సులభమే. స్థానికులమైన మేము ఇక్కడే డ్రైవర్లుగా పనిచేస్తున్నాం. తిరుపతి జిల్లాకు అధికంగా విద్యుత్ బస్సులను కేటాయించడం వల్ల పలువురికి ఉపాధి లభిస్తోంది. ఈ బస్సుల్లో ప్రయాణికులు సురక్షితంగా, హాయిగా రాకపోకలు సాగించవచ్చు.

– నవీన్‌కుమార్, విద్యుత్ బస్సు డ్రైవర్

న్యూస్‌రీల్

'ఆపదమిత్ర'లతో ప్రజలకు ఉపయోగం



ఆపద మిత్రలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

శ్రీకాళహస్తి: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపదమిత్ర శిక్షణ పొందివారి సేవలు ప్రజలకు ఉపయోగకరమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఈటీసీ కేంద్రంలో ఆపదమిత్ర శిక్షణ పొందుతున్నవారిని ఆయన అభినందించారు. ప్రిన్సిపల్ నాగపద్మజ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు ఆపదమిత్రలకు శిక్షణ కొనసాగుతుందన్నారు. అనంతపురం, పుటపర్తి, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల నుంచి 88మంది శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు శిక్షణానంతరం ఆపదమిత్రలకు గుర్తింపుకార్డు, రూ.10వేల విలువైన కిట్ తోపాటు రూ.5లక్షల బీమా ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామారావు, వైస్ ప్రిన్సిపల్ విద్యారమ, సీనియర్ ఫ్యాకల్టీ సమత పాల్గొన్నారు.

తిరుమలలో ఏవీఎస్‌వోల బదిలీలు

తిరుమల : తిరుమలలో నిఘా, భద్రతా విభాగంలోని వివిధ సెక్టార్లలో పనిచేస్తున్న ఏవీఎస్‌వోలను బదిలీచేస్తూ సీవీఎస్‌వో నరసింహ కిషోర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులను జారీచేశారు. ఇందులో శ్రీవారి ఆలయం సెక్టార్–1 ఏవీఎస్‌వోగా సెక్టార్–2 ఏవీఎస్‌వోగా పనిచేస్తున్న ఎం.మనోహర్ నియమితులయ్యారు. ప్రస్తుతం సెక్టార్–5 ఏవీఎస్‌వోగా పనిచేస్తున్న బి.విశ్వనాథం సెక్టార్–2 ఏవీఎస్‌వోగా నియమించారు. సెక్టార్–1 ఏవీఎస్‌వోగా పనిచేస్తున్న ఏ.సురేంద్రను సెక్టార్–5 ఏవీఎస్‌వోగా నియమించారు. ప్రస్తుతం లగేజీ సెంటర్లు, క్యూల నిర్వహణ ఏవీఎస్‌వోగా పనిచేస్తున్న వై.సతీష్‌కుమార్‌ను సెక్టార్–8 పరకామణి కమాండ్ కంట్రోల్ సెంటర్, లగేజీ సెంటర్, షూ కీపింగ్ సెంటర్ ఏవీఎస్‌వోగా నియమితులయ్యారు. వీరితోపాటు ఎనిమిది మంది విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లను పరస్పర బదిలీలను చేశారు.

రూ.35లక్షలతో పాఠశాల అభివృద్ధి

- ఎవర్టన్ టీ పరిశ్రమ ఎండీ రోషన్ గుణవర్ధన్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను రూ.35లక్షలతో అభివృద్ధి చేసినట్లు శ్రీసిటీలో ఎవర్టన్ పరిశ్రమ ఎండీ రోషన్ గుణవర్ధన్ తెలిపారు. బుధవారం ఈ మేరకు పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు, ఆర్చి గేటు, ఫెన్సింగ్‌ను ప్రధానోపాధ్యాయని విమలకుమారితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాండూరు హైస్కూల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విమల కుమారి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎవర్టన్ టీ పరిశ్రమ యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. అత్యంత నాణ్యతాప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సామర్ల భువనేశ్వరి, సర్పంచ్ కవిత, ఉపసర్పంచ్ మహేంద్ర, పరిశ్రమ ప్రతినిధులు అఖిల్, ఆంతోనియా, సాయిరాం, సునీల్, ప్రతాప్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వెంకటేశులు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఏఎస్‌ఓకు ఉద్యోగోన్నతి

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న శేషాచలం రాజుకు డీఎస్‌ఓగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయనను తిరుపతి డీఎస్‌ఓగా బదిలీ చేసింది.

పవిత్రం.. ఇఫ్తార్ పరిమళం



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

తిరుపతి కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందుల పరిమళం సర్వమత సామరస్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని షాదీమహల్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణతో కలిసి ఎమ్మెల్యే భూమన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇస్తాం అంటేనే మనకు మనం సమర్పించుకోవడమేనని చెప్పారు. మహమ్మద్ ప్రవక్త శాంతి కాముకుడని, దైవ దూతని వివరించారు. శాంతి కాముకులైన ముస్లిం సోదరులను తిరుపతి గంగమ్మ జాతరకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మతసామరస్యానికి అందరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాసదీక్షతో అల్లాహ్‌ను ప్రార్థించడం వల్ల అంతా మంచే జరుగుతుందన్నారు. ఈ ఏడాది తిరుపతి నగరంలో ఇఫ్తార్ విందు జరగడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవ భక్తికి క్రమ శిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఉత్తమమైందని వివరించారు. అనంతరం ముఖ్య అతిథులను మసీదు కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాసరావు, ఎస్‌డీసీ భాస్కర్ నాయుడు, జిల్లా మైనారిటీ అధికారి చిన్నారెడ్డి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ మహ్మద్ ఖాదరీ, మైనారిటీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ ఇమ్రాన్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, కో–ఆప్షన్ సభ్యులు ఇమామ్, ఎస్.ఖాదర్‌భాషా పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిలు ఇద్దరిని బదిలీచేస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఇతర ప్రాంతాల నుంచి ముగ్గురు సీనియర్ సివిల్ జడ్జిలను మూడు కోర్టుల్లో నియమిస్తున్నట్లు పేర్కొంది. తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ వై.శ్రీనివాసరావును పదోన్నతిపై విజయవాడ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్‌గా, తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష్‌ను మదనపల్లె అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా హైకోర్టు బదిలీచేసింది. ఈ రెండు కోర్టులకు నూతన జడ్జిలు బాధ్యతలు స్వీకరించేవరకు శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జిని ఇన్‌చార్జ్‌గా వ్యవహరించాలని పేర్కొంది. అదేవిధంగా తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా ప్రస్తుతం గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న డి.విజయసారధిరాజును, తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ప్రస్తుతం గుంటూరు 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఎ.సునీతరాణిని నియమించింది. కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి సి.మురళీధర్‌ను గూడూరు సీనియర్ సివిల్ జడ్జిగా, గూడూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ జానీ బాషను రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించింది. బదిలీ అయిన న్యాయమూర్తులు మే 2వ తేదీలోపు బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో తెలిపింది.

ముక్కంటి సేవలో నాగసాధువులు



ఆలయ కమిటీ చైర్మన్‌ను ఆశీర్వదిస్తున్న నాగసాధువులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం హరిద్వార్‌కు చెందిన నాగసాధువులు దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

పక్కాగా ఇళ్లు.. ఊళ్లు

- జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం
- పకడ్బందీగా మౌలిక వసతులు
- సామూహిక గృహప్రవేశాలకు ప్రత్యేక ప్రణాళిక
- నిత్యం సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జగనన్న కాలనీలను తీర్చిదిద్దుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అత్యున్నతంగా మౌలిక వసతులు సమకూరుస్తున్నారు. పక్కాగా ఇళ్లు నిర్మించి ప్రత్యేక ఊళ్లనే ఆవిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నారు. యుద్ధప్రాతిపదికన నిర్మాణాలను పూర్తి చేసేందుకు శరవేగంగా కార్యాచరణ అమలు చేస్తున్నారు. త్వరితగతి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు చేపట్టిన పనులపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి



హాజరైన పలు శాఖల అధికారులు

సాక్షి, తిరుపతి : జిల్లాలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం 575 లేఅవుట్లు ఏర్పాటు చేసింది. అందులో 67,463 మంది లబ్ధిదారులకు స్థలాలు పంపిణీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటి వరకు 13,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించింది. మరో 54వేల గృహాలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. వీటి పనులను వేగవంతం చేసి త్వరలోనే సామూహికంగా లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు సన్నాహాలు చేస్తోంది.

వసతుల కల్పన వేగవంతం

జగనన్న కాలనీల్లో చిందేపల్లె, బి కొత్తపల్లెలో మాత్రమే దాదాపు 5వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. వెయ్యి నివాసాలకు పైగా ఉన్నవి 100 లే అవుట్లు ఉన్నాయి. 500 గృహాలకు పైగా ఉన్న కాలనీలు 350 వరకు ఉన్నాయి. మిగిలిన లే అవుట్లలో అంత కంటే తక్కువ నివాసాలు నిర్మిస్తున్నారు. ప్రతి లే అవుట్‌లోనూ నాలుగు బోర్లకు తక్కువ లేకుండా వేశారు. నీటి సరఫరా కోసం పైపు లైన్లు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మురుగునీటి కాలువ నిర్మాణాలు అన్ని కాలనీల్లో దాదాపు పూర్తి కావచ్చాయి. ఇళ్ల నిర్మాణాలకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా అన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భవనాలకు భూ కేటాయింపు

ప్రతి లే అవుట్లలో నివాసం ఉంటున్న వారికి సకల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ప్రతి కాలనీలో రెండెకరాల నుంచి 4 ఎకరాలను ప్రత్యేకంగా కేటాయించి, అందులో ఆట స్థలం, పార్కు, ఆస్పత్రి, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రం, పశువుల ఆస్పత్రి తదితరాలకు భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది.

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి : కలెక్టర్

తిరుపతి, శ్రీకాళహస్తి డివిజన్ల పరిధిలో జగనన్న ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం సమీక్షించారు. సామూహిక గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా ఊళ్లు ఏర్పాటవుతున్న నేపథ్యంలో పెద్ద లేఅవుట్లలో కేటగిరీ 3 కింద సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు కూడా త్వరితగతిన పనులు పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకుని పనులు ప్రారంభించని వారిని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కలిసి మోటివేట్ చేయాలని తెలిపారు. స్టేజి పురోగతిపై ఆసక్తి చూపని వారు ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన నిధులను తిరిగి చెల్లించాల్సి ఉంటుందనే విషయంపై అవగాహన కల్పించాలని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో ఏమాత్రం అలసత్వం వహించినా సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఈఈ శేషగిరి , అధికారులు శ్రీనివాసరావు శేషారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వరదయ్యపాళెం: స్నానమాచరించి గుడికి వెళ్లేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన శ్రీసిటీ సమీపంలోని చిలమత్తూరు చెరువు వద్ద బుధవారం చోటుచేసుకుంది. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడులోని పొన్నేరికి చెందిన బాబు (45) శ్రీసిటీలోని సిద్ధమగ్రహారంలో వివాహం చేసుకున్నాడు. ఉపాధి కోసం శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు వెళ్లేవాడు. బుధవారం సూళ్లూరుపేటలోని అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు మార్గం మధ్యలోని చిలమత్తూరు చెరువు వద్దకు స్నానమాచరించేందుకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో చెరువు లోతట్టు ప్రాంతానికి చేరుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక పశువుల కాపరులు గుర్తించి శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని నీటిలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సామాన్య భక్తుడికే తొలి ప్రాధాన్యం

- శ్రీవారి దర్శనానికి వేలాది టికెట్లు విడుదల చేసిన టీటీడీ
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్



తిరుమల : శ్రీవారి దర్శనంలో టీటీడీ సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తోంది. మే, జూన్, జూలై మాసాల్లో కోనేటిరాయుడి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం వున్న నేపథ్యంలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిత్యం వేలాదిగా శ్రీవారి దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.టిక్కెట్లు పొందిన భక్తులు వారికి కేటాయించిన సమయానికి క్యూలైన్ వద్దకు వస్తే రెండు, మూడు గంటల్లోనే స్వామివారి దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ, సహస్రదీపాలంకార సేవా టిక్కెట్ల కోటాను గురువారం ఉదయం 11.30 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే సుప్రభాతం, అర్చన, తోమాల, వారపుసేవలైన అష్టదళపాదపద్మారాధన సేవా టిక్కెట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి 22వ తేదీ ఉదయం 10 వరకు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో భక్తులకు టిక్కెట్లను కేటాయించనుంది. ఇక గురువారం మధ్యాహ్నం 3గంటలకు జూలై మాసం శ్రీవాణి ట్రస్టు టిక్కెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల చేయనుంది. ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు జూలై మాసం అంగప్రదక్షిణ టోకెన్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మే నెలకు సంబంధించిన ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఈనెల 21న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనుంది. 24న మే మాసం వర్చువల్ ఆర్జిత సేవాటిక్కెట్ల కోటాని అందుబాటులో ఉంచనుంది. మే, జూన్ నెలలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల కోటాను ఈనెల 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. నిత్యం 10వేల నుంచి 12వేల టిక్కెట్ల లెక్కన దాదాపు 7లక్షల ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లని భక్తులకు అందుబాటులో ఉంచనుంది. మే నెల గదుల కోటాను ఈనెల 26న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈక్రమంలోనే ఆన్‌లైన్‌లో టికెట్లు దొరకని వారు తిరుపతిలోని విష్ణు నివాసం, శ్రీనివాసం, గోవిందరాజ సత్రాల వద్ద, శ్రీవారి మెట్టు మార్గంలో 1,240వ మెట్టు వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తోంది.

ఆత్మీయంగా పలకరిస్తూ.. ఆశీస్సులు అందుకుంటూ

- ఎర్రావారిపాళెంలో ముగిసిన మహాపాదయాత్ర
- గడప గడపలో విశేషాదరణ
- ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగిన మోహిత్‌రెడ్డి



పార్టీ శ్రేణులకు భోజనం వడ్డిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డితో కలసి ప్రజలకు అభివాదం చేస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ప్రజలు అపూర్వంగా ఆదరించారు. ఆయన మహా పాదయాత్రంలో భాగంగా ఎర్రావారిపాళెం మండలంలో మొత్తం 14 రోజులపాటు పర్యటించారుర. 214 గ్రామాలు, 12 పంచాయతీ, 11 సచివాలయాలు పరిధిలోని 9,580 ఇళ్లను సందర్శించారు. నిత్యం13 కిలోమీటర్లు చొప్పున మొత్తం 182 కిలోమీటర్లు పూర్తి చేశారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ.. ప్రజల ఆశీస్సులు అందుకుంటూ ముందుకు సాగారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం నీరాజనాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్క ఎర్రావారిపాళెం మండలంలోనే రూ. 30 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. ప్రతి పంచాయతీకి రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు కేటాయించినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, సచివాలయం భవనాలు, సమావేశ మందిరాలు, రచ్చబండలు, బెంచీలు నిర్మించినట్లు వివరించారు. ప్రజాదరణ చూస్తుంటే మొత్తం 175 స్థానాల్లో విజయం సాధిస్తామని అర్థమవుతోందన్నారు. చంద్రగిరి నియోజక వర్గంలో మంచి మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మీయ సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు కోసం ఏర్పాటు చేసిన విందు భోజనాన్ని మోహిత్‌రెడ్డి స్వయంగా వడ్డించారు. పేరు పేరు న ప్రతి ఒక్కరినా ఆప్యాయంగా పలకరించి వినమ్రంగా నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. పార్టీ బలోపేతానికి ఇదే విధంగా సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవి శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61,910
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,530
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.76,100
రిటైల్ వెండి గ్రాము రూ.78.10

క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారం

- జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్
- పథకాల అమలు తీరు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి
- తిరుపతి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా శ్యామలరావు

తిరుపతి అర్బన్: క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. రాష్ట్రస్థాయి ఆదేశాల అనంతరం కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్పందనలో వచ్చే సమస్యలకు పరిష్కారం చూపాలని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల పనితీరును పరిశీలించడానికి తిరుపతి జిల్లాకు ఐఏఎస్ అధికారి, ఉన్నత విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామలరావును నియమించారని తెలిపారు. స్పందనలో అర్జీలు ఎక్కువగా వస్తున్న మొదటి ఐదు శాఖలను గుర్తించాలని చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించారని వెల్లడించారు. రెవెన్యూ, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గృహ నిర్మాణం తదితర శాఖలపై తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఎల్‌డీవో సుశీలాదేవి, సచివాలయం కోఆర్డినేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కించపరిచేలా కాదు.. త్యాగాలు చూపండి

తిరుపతి మంగళం : పుష్ప సినిమా తొలి భాగంలో దర్శకుడు అటవీ, పోలీసు అధికారులను కించపరిచేలా చూపారని, కనీసం రెండో పార్ట్‌లో అయినా తమ త్యాగాలను చూపాలని టాస్క్‌ఫోర్స్ విశ్రాంత ఐజీ కాంతారావు సూచించారు. బుధవారం తిరుపతిలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని ఆయాన సందర్శించారు. ఈ సందర్భంగా తాను విధులు నిర్వర్తించిన సమయంలో ఎర్రచందనం సంరక్షణకు తీసుకున్న చర్య లు, స్మగ్లర్లతో చేసిన పోరాటాలు, అవగాహ న కల్పించడానికి తీసుకున్న చర్యలను గుర్తు చేసుకున్నారు. పుష్ప సినిమా తీసే సమయంలో దర్శకుడు సుకుమార్ తమను సంప్రదించి అనేక వివరాలు తీసుకున్నారని చెప్పారు. అయితే సినిమాను కమర్షియల్‌గా విజయవంతం చేసుకోవడానికి పోలీసులు, అటవీశాఖ అధికారులు లంచగొండులుగా, చెడు అభిప్రాయం కలిగేలా చూపించారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు, శ్రమను చూపిస్తే బావుండేదని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి సినిమా లు తీయడం మంచిది కాదని హితవు పలికారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ డైరెక్టర్ రాజేంద్ర

తిరుపతి క్రైమ్ : జిల్లాలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ రాజేంద్ర ఆదేశించారు. బుధవారం తిరుపతిలోని పోలీస్ అతిథి గృహంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పోలీసు శాఖ సమన్వయంతో ఆపరేషన్ పరివర్తన 2.0 అమలు చేసి సత్ఫలితాలు సాధించామన్నారు. అదే స్ఫూర్తితో యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్‌ను పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయించే ,సేవించే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తుందో మూలాల్లోకి వెళ్లి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తిరుపతి గంగ జాతరలో మాదక ద్రవ్యాలు కనిపించకూడదని తెలిపారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ బి.స్వాతి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేవీ ర్యాలీలో అద్భుత ప్రతిభ

- 23 మంది ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల ఎంపిక



నావీ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్వీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన నేవీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని అకాడమీ క్యాంపస్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ అకాడమీలో నాణ్యమైన విద్యతో పాటు శారీరక దృఢత్వం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సత్కరించి, వారికి మెమెంటోలు అందించారు.

గేదెను కాపాడబోయి.. ఊబిలో చిక్కుకుని రైతు మృతి

వాకాడు: నీటిగుంటలో చిక్కుకున్న తన గేదెను కాపాడబోయిన రైతు ఊబిలో చిక్కుకుని మృతి చెందిన ఘటన ముట్టెంబాక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన పల్లంపర్తి వెంకటరమణారెడ్డి(63) అనే రైతుకు చెందిన గేదె ఊరు శివారులో ఉన్న నీటి గుంటలో చిక్కుకుంది. గేదెను కాపాడుకునే క్రమంలో నీటిలోకి దిగిన వెంకటరమణారెడ్డి ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను బయటకు తీసి వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రైతు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

రుణాల స్వాహా కేసులో నలుగురి అరెస్టు

వరదయ్యపాళెం: నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి గిరిజన మహిళల పేరిట రూ. 2.50కోట్ల రుణాలను స్వాహా చేసిన కేసులో నలుగురు వెలుగు సిబ్బందిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వరదయ్యపాళెంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు, డీసీసీ బ్యాంకుల్లో నిందితులు రూ. 2.50కోట్ల రుణాలు పొంది స్వాహా చేసిన విషయం తెలిసిందే. దీనిపై బ్యాంకు అధికారులు, వెలుగు ఉన్నతాధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 5నెలల క్రితం కేసు నమోదైంది. అప్పట్లో నిందితుడు అంబూరు సంఘమిత్ర యువరాజును మాత్రమే అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇతర నిందితులు మోపూరుపల్లె చెందిన సంఘమిత్ర ఇంద్రజ, సీఎల్ఎన్ పల్లెకు చెందిన స్వీపర్ తులసమ్మ, సంతవేలూరుకు చెందిన వీఓ లీడర్ విజయమ్మ, ఎంజీనగర్‌కు చెందిన వీఓ లీడర్ శారద పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. మరో నిందితురాలు వెలుగు ఏపీఎం సీబీ జ్యోతిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తిరుచానూరు(చంద్రగి) : మండలంలోని దామినీడు వద్ద ఇందిరమ్మ ఇళ్లలో బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కాలనీలోని బ్లాక్ నంబర్ 21లో నివసించే నటరాజన్(35) అనే వ్యక్తి తిరుమలలో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన నటరాజన్ మద్యం సేవించి ఉండడంతో పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రించాడు. ఇంతలో ఏం జరిగిందో కానీ, ఆ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం మృతుడి భార్య ఈ విషయాన్ని గుర్తించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకట సుబ్బయ్య ఘటన స్థలానికి చేరుకుని, విచారణ చేపట్టాడు. కుటుంబ సమస్యలతో మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

తడ : మండలంలోని వాంటంబేడు ఎస్టీ కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. పెద్దమాంబట్టు గిరిజనకాలనీకి చెందిన దాసర్ల గోపి(24) తన భార్య గంగమ్మతో కలిసి రెండు నెలల క్రితం చేపల చెరువుకు కాపలాకు వెళ్లాడు. ఇటీవల తిరిగి గ్రామానికి వచ్చేశాడు. భార్య ఊరైన వాంటంబేడుకు చేరుకుని కూలి పనులకోసం ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఎక్కడ కాపురం పెట్టాలో తెలియక మనస్థాపంతో గుళికల మందు తినేశాడు. స్థానికులు ఈ విషయం గుర్తించి వెంటనే సూళ్లూరు పేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.